క్లుప్తంగా

ఇంకుడు గుంత నిర్మించరూ..!



బోరింగ్ వద్ద నిలిచిన నీరు

వాంకిడి: మండలంలోని జంబుల్‌ధరి గ్రామ పంచాయతీ కేంద్రంలోని ఓ తాగునీటి బోరింగు వద్ద ఇంకుడు గుంత లేకపోవడంతో నీరంతా రోడ్డుపై పారుతోంది. సైడ్ డ్రెయిన్ కూడా లేకపోవడంతో మురుగునీరంతా నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. బోరింగు వద్ద ఇంకుడు గుంత నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

జ్యోతిబా పూలే జయంతి ఘనంగా నిర్వహించాలి

వాంకిడి: ఈ నెల 11న మహాత్మ జ్యోతిబా పూలే 197వ జయంతిని ప్రతీ గ్రామంలో ఘనంగా నిర్వహించాలని మాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వడై బాబురావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే విగ్రహం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించే జయంతి వేడుకలకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను ట్రేస్‌చేసి బాధితులకు పోలీసులు అప్పగించారు. ఈజ్‌గాంకు చెందిన రాజు, అందవెల్లికి చెందిన అజయ్, నామానగర్ గ్రామానికి చెందిన మధూకర్‌లు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకోగా, ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించారు. ఈసందర్భంగా ఎస్సై రామన్‌కుమార్ మాట్లాడుతూ మొబైల్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సెల్‌ఫోన్‌లను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీంను అభినందించారు. ఏఎస్సై హీరామన్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్పీఎం అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఈఎస్ఐ, శివాజీ చౌరస్తాల్లో స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాలను ప్రారంభించారు. సీజీఎం సురేందర్ బియాని, జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ మేనేజర్ రమేశ్‌రావు, ప్రతినిధులు రీణ, తుమ్మ రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయ నూతన కమిటీ



నియామక పత్రం అందజేస్తున్న సభ్యులు

రెబ్బెన: మండల కేంద్రంలోని కోదండ రామాలయం నూతన కమిటీని మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వనమాల మురళీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ నాయుడు, కోశాధికారిగా కిరణ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా దేవేందర్, చిరంజీవిగౌడ్, ముఖ్య సలహాదారుడిగా నవీన్‌జైస్వాల్, గౌరవ సలహాదారులుగా రమేశ్, తిరుపతి, శ్రీధర్, సుదర్శన్‌గౌడ్, సోమశేఖర్, మదునయ్య, సలహాదారులుగా అజయ్ జైస్వాల్, రాజేందర్ జైస్వాల్, మహావీర్‌జైస్వాల్, రాజేందర్ అగర్వాల్, కన్వీనర్‌గా శ్రీనివాస్, కార్యదర్శులుగా దుర్గారావు, మురళీగౌడ్, సర్వేశ్వర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్, గోగర్ల రాజేశ్, సంయుక్త కార్యదర్శులుగా గోపి, రాజేశ్వర్‌రావు, శేఖర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రాయచూర్ పరిశీలకులుగా అర్షద్ హుస్సేన్



అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుగా అర్షద్ హుస్సేన్ నియమితులయ్యారు. సిర్పూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ నాయకుడైన మండల కేంద్రానికి చెందిన అర్షద్ హుస్సేన్‌ను పరిశీలకుడిగా నియమిస్తూ ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్వా శివాజీరావు మోఘే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు

లింగాపూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వంజారిగూడ గ్రామంలో మంగళవారం ఘనంగా ఉగాది సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని పిక్లాతండా, కొత్తపల్లి, జాముల్‌ధరా, దంపూర్, కంచన్‌పల్లి, మోతిపటార్, చోర్‌పల్లి, వంకామద్ది తదితర గ్రామాలలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు తదితర గ్రామాల్లో క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వ్యవసాయ పనులను ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పచ్చడి, తీపి, వగరు వంటలను ఆరగించారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

దహెగాం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మంగళవారం తెలుగు సంవత్సరం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పచ్చడి చేసుకొని సేవించారు. స్థానిక శివాలయంలో, లగ్గాం, కుంచవెల్లి, చినరాస్పెల్లి ఆలయాల్లో పంచాంగ శ్రవణం పఠించారు.

కెరమెరి: క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆంజనేయునికి, శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే తలంటు స్నానం ఆచరించి భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం పఠించారు. పురోహితుడు కులకర్ణీ బాపూదేవ్ ఉన్నారు.

పొలం పనులకు శ్రీకారం..

ఉగాది పురస్కరించుకొని మంగళవారం మండలంలోని బాబేఝరి మహరాజ్‌గూడతో పాటు వివిధ గ్రామాల్లో రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టారు. ఉదయం పొలాల్లోకి వెళ్లి ఎద్దులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భూమాతకు మొక్కుకొని పొలంలో ఉన్న చెత్తాచెదారం ఏరడంతో పాటు అరకలు దున్నడం ప్రారంభించారు.

ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీక్రోధి నామసంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పాన్ని నిర్వహించి అనంతరం షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం భజనా కార్యక్రమం చేపట్టారు. సభ్యులు వివేక్, రమేశ్, నారాయణమూర్తి, శ్రీనివాస్, సుధాకర్, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



దహెగాం: శివాలయంలో పంచాంగ శ్రవణం వింటున్న ప్రజలు



రెబ్బెన: ఉగాది పచ్చడితో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య

సిర్పూర్(టి): మండలంలో మంగళవారం క్రోధినామ ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయం, రాచర్ల హనుమాన్ ఆలయం, శివాలయం, మండలంలోని టోంకిని గ్రామంలో గల శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం, లోనవెల్లి, చీలపెల్లి రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం నిర్వహించిన లక్కీ కూపన్ డ్రా ఓపెన్ చేశారు. లక్కీ డ్రాలో గెలుపొందిన భక్తులకు మారుతి ఆల్టో కారుతో పాటు గోల్డ్, సిల్వర్ కాయిన్స్ అందజేశారు.

కౌటాల: మండలంలోని ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఉగాది పండుగ జరుపుకున్నారు. మండల కేంద్రంలోని కంకలమ్మ కేతేశ్వర స్వామి, శివాలయం, కోదండ రామాలయం, గురుడుపేటలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉగాది సందర్భంగా భక్తులు శివాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తుల పల్లకి ఊరేగించారు. రైతులు వ్యవసాయ చేనుల్లో ప్రత్యేక పూజలు చేశారు. వ్యాపారులు దుకాణాలను, వాహనదారులు వాహనాలను కడిగి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శంకరయ్య, సంతోష్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని రామాలయం, ఎల్కపల్లి, ఎల్లూర్ హనుమాన్, చేడ్వాయి శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో రుద్రాభిషేకాలు నిర్వహించారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు.

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం తెలుగు సంవత్సరాధి ఉగాది పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ రైతులు పంట పొలాల్లో వ్యవసాయ పనులు ప్రారంభించారు. మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం, గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయాలతో పాటు గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి, నంబాల శివాలయం, ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. గోలేటిలో బెటర్ యూత్ బెటర్ సొసైటీ, స్నేహ సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, స్నేహ సేవా సమితి అధ్యక్షుడు గోపాలక్రిష్ణ, బెటర్ యూత్ బెటర్‌సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రంజిత్, సభ్యులు ఉన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో మంగళవారం క్రోధి నామ సంవత్సరాది ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లోని ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. ఖర్జెల్లి ఓంకార ఆశ్రమంలో పండితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీరాధాక్రిష్ణ మందిరంలో లోక కల్యాణం కోరుతూ పూజలు నిర్వహించారు.



లింగాపూర్: పూజలు చేస్తున్న రైతులు



కౌటాల: ఉగాది పచ్చడి అందిస్తున్న అర్చకులు



కౌటాల: వ్యవసాయ పనులు చేస్తున్న రైతు



సిర్పూర్ (టి): ఆలయంలో లక్కీడ్రా నిర్వహిస్తున్న నిర్వాహకులు



రెబ్బెన: గోలేటిలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



చింతలమానెపల్లి: ఓంకార ఆశ్రమంలో..



కెరమెరి: రాశి ఫలాలను వివరిస్తున్న పురోహితుడు



ఆసిఫాబాద్‌అర్బన్: పచ్చడి పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కెరమెరి: పొలంలో భోజనం చేస్తున్న రైతులు

సేవాలాల్ కమిటీ ఆధ్వర్యంలో ‘ఉగాది’



జెండా ఆవిష్కరిస్తున్న కుల పెద్దలు

రెబ్బెన: మండల కేంద్రంలో మంగళవారం సేవాలాల్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముందుగా సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేశారు. భోగ్‌బండార్ పూజలు నిర్వహించి జగదాంబ దేవీ, సేవాలాల్ మహరాజ్‌లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సేవాలాల్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కులపెద్దలు బలరాం నాయక్, దుప్పానాయక్, రాజు నాయక్, రమేశ్, జెడ్పీటీసీ సంతోష్, మాజీ జెడ్పీటీసీ బాబురావు నాయకులు సుదర్శన్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, అజయ్‌జైస్వాల్, గోపి, మదునయ్య పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న భక్తులు

రెబ్బెన: ఉగాది పండుగ పురస్కరించుకొని మండలంలోని పుంజుమేరగూడ పోచమ్మ ఆలయం వద్ద భక్తులు నూతన జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నూతన జెండా ఎత్తి మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీటీసీ సంతోష్, నాయకులు సుదర్శన్‌గౌడ్, మదునయ్య, రాజేశ్, రమేశ్, చిరంజీవిగౌడ్, శ్రీధర్, రాజాగౌడ్, గోపి, తిరుపతి, మురళీగౌడ్, అరుణ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: ఉగాది పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కలికోట రమణయ్య జెండా ఎగురవేశారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంఘ భవనంలో చేపట్టాల్సిన అత్యవసర పనులపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్, కోశాధికారి జలపతి, భవన ఇన్‌చార్జి సత్యనారాయణ, నాయకులు జయచందర్, రామయ్య, తిరుపతి, చిరంజీవి, కొటేశ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మోసం గ్రామపంచాయతీ పరిధిలో గల ఆరెగూడ గ్రామంలోని చత్రపతి శివాజీ విగ్రహం వద్ద ఉగాది సంబరాలు జరుపుకున్నారు.

పోలీసు కవాతు

బజార్‌హత్నూర్: మండలంలోని కొలారి, బజార్ హత్నూర్, గిర్నూర్, పిప్రి గ్రామాల్లో బోథ్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు, సీఆర్పీ జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు.

పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు

తలమడుగు: పీఆర్టీయూ తెలంగాణ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లింగి గ్రామంలో వృద్ధాశ్రమంలో నాయకులు వృద్ధులకు పండు పంపిణీ చేశారు.

రాంజీగోండు పోరాట స్ఫూర్తి మరువలేనిది

తిర్యాణి: దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసి అసువులు బాసిన రాంజీగోండు పోరాట స్ఫూర్తి మరువలేనిదని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం రాంజీగోండు 167వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాంజీ గోండు పోరాటం చరిత్రలో లిఖించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్నాక ప్రవీణ్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు, డివిజన్ అధ్యక్షుడు గెడం సుభాశ్, మండల అధ్యక్షుడు భాస్కర్ తదితరులు ఉన్నారు.

రాంజీగోండ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

బెజ్జూర్: ఆదివాసీ హక్కులు, అభివృద్ధి కోసం బ్రిటీష్ వారితో పోరాటాలు చేసి అమరుడైన రాంజీ గోండ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రాంజీ గోండ్ 167వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చిన్నయ్య, ఖాజాసమీ ఉద్దీన్, జ్యోతి, దేవాజి, రాజన్న, రాజేశ్, జీవన్, ఆనంద్‌రావు, విలాస్, అశోక్, రమేశ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బెజ్జూర్: రాంజీగోండ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

‘కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం’



మాట్లాడుతున్న రజాక్

కెరమెరి: కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు ఖాయమని పార్టీ మైనార్టీ సెల్ ఆసిఫాబాద్ నియోజకవర్గ పర్యవేక్షకుడు, ఇన్‌చార్జి అబ్దుల్ రజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రజలకు చేసింది ఏం లేదన్నారు. తనపై నమ్మకం ఉంచి జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు ప్రతాప్‌గడి, ఎంఏ లతీఫ్, జిల్లా నాయకులు విశ్వప్రసాద్, శ్యాంనాయక్ అప్పగించిన బాధ్యతను తప్పకుండా నిర్వర్తిస్తానన్నారు. నాయకులు ఎల్లప్ప, సుదర్శన్, బాబు, యూసూఫ్, తిరుపతి, నాగుపటేల్, సోనేరావు, శ్రీకాంత్, శ్యాంరావు, తుల్సిదాస్ తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ





లింగాపూర్: మండల కేంద్రంలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని కాలనీల్లో మురుగు కాలువలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలు ఉన్న చోట పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడాల్సి వస్తుందని మండల కేంద్రం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ట్యాంకు నుంచి మోసుకెళ్లాల్సిందే..!



ట్యాంకు వద్ద నీళ్లు పట్టుకుంటున్న చిన్నారులు

వాంకిడి: మండలంలోని ఎనోలి కొలాంగూడ గ్రామంలో మిషన్ భగీరథ నీరు ఇంటింటికి సరఫరా జరగడం లేదు. మార్చి 17న గ్రామంలోని తాగునీటి సమస్యపై ‘సాక్షి’లో ‘తాగు నీటి కష్టాలు’ శీర్షికన కథనం ప్రచురితం కాగా స్పందించిన ఉన్నతాధికారులు ఎనోలి కొలాంగూడను మార్చి 27న సందర్శించారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో పాటు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మిషన్ భగీరథ జిల్లా అధికారులు గ్రామానికి వచ్చి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ అధికారులను రెండు రోజుల్లో నీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ అధికారులు మాత్రం ట్యాంకు వరకు నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ట్యాంకు వద్ద ఉన్న పెద్దపైపు నుంచి వచ్చే నీటిని బిందెలతో మోసుకెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశించి 15 రోజులు గడిచినా.. మరమ్మతులు జరిపించి ఇంటింటికి నీరందించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

రెబ్బెన: నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తే చర్యలు తప్పవని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం రాత్రి గోలేటిలో వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే రీతిలో వాహనాలు నడపొద్దని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం మూలంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు.